క్లుప్తంగా

ఆలూర్ సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాస్ ఎన్నిక



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఇస్సాపల్లి గ్రామానికి చెందిన తంబూరి శ్రీనివాస్ బుధవారం ఎన్నికయ్యారు. మూడు సంవత్సరాల క్రితం నిర్వహించిన సొసైటీ ఎన్నికల్లో ఆలూర్ గ్రామానికి చెందిన క్లెం భోజారెడ్డి తొలి మూడు సంవత్సరాలు, మరో రెండు సంవత్సరాలు ఇస్సాపల్లి గ్రామానికి చెందిన తంబూరి శ్రీనివాస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈక్రమంలో క్లెం భోజారెడ్డి మూడేళ్ల పూర్తవడంతో ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలో సొసైటీ కార్యాలయంలో బుధవారం చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించారు. సహకార శాఖ అధికారిణి రమావతి ఎన్నికల అధికారిణిగా వ్యవహరించారు. శ్రీనివాస్ ఒక్కరే నామినేషన్ వేయగా ఎన్నికల అధికారిణి ఆయనను చైర్మన్‌గా ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రుద్రూర్: మండలంలోని దేవునిగుట్ట, బస్వాపూర్, చైతన్ నగర్, లింగాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం కోటగిరి ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రుద్రూర్: మండలకేంద్రంలో బుధవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళా మోర్చా ప్రతినిధులు నాగరాజాకుమారి, శ్యామల, నాయకులు సుధాకర్‌గౌడ్, ఆలపాటి హరికృష్ణ, గజేందర్, కృష్ణంరాజు, శ్రీనివాస్, కేవీడీ సాయిలు, వినోద్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం



వర్ని: చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు బుధవారం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా తీర్మానం చేశారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతామని పేర్కొన్నారు. తీర్మాన ప్రతిని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



బాల్కొండ: మహిళ సమాఖ్య ద్వారా పొందుతున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు సంగీత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు లావాదేవీలను సరిగా నిర్వహించాలన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకని ఆర్థికంగా ఎదగలన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఆర్థిక లావాదేవీలపై ఆమోదం తెలిపారు. కార్యదర్శి లత, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

'వర్గీకరణ బిల్లు' ప్రవేశపెట్టాలి

బోధన్‌టౌన్: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో- ఆర్డినేటర్ డల్లా సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. బిల్లు ఆమోదించకపోతే మాదిగల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి భూమయ్య, పట్టణ అధ్యక్షులు అబ్బయ్య దీక్షకు మద్దతు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వర్ని: మండలంలోని పైడిమల్, కోకల్‌దాస్ తండా గ్రామాలకు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్ బాబా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు విఠల్‌పటేల్, శంషుద్దీన్, కిషన్, నరేడ్ల సాయిలు, రూప్సింగ్ పాల్గొన్నారు.

మాయమవుతున్న గుట్టలు!

- వెలుస్తున్న ప్లాట్లు
- గుట్టుగా మొరం అక్రమ రవాణా
- బాల్కొండలో మొరం మాఫియా దందా
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలో మొరం మాఫియా మాఫియా యథేచ్ఛగా మొరం, మట్టి తవ్వకాలు చేపట్టడంతో గుట్టలు మాయమవుతున్నాయి. బాల్కొండలో సమీకృత హాస్టల్ భవనం వెనుక, కేజీబీవీ పాఠశాల పక్కన, ఎన్టీఆర్ కాలనీ మోడల్ పాఠశాల పక్కన ఉన్న గుట్టల నుంచి ప్రతిరోజు నిశి రాత్రిలో మొరం దందా మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా సాగుతున్నాయి. అయినా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సుమారుగా ఆరు నెలలుగా ఈ తంతు నడుస్తున్నా, అధికారులు తమ దృష్టికి రాలేదన్నట్లుగా సమాధానం చెప్పడం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయంలో మొన్నటి వరకు తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారి కనుసన్నల్లోనే మొరం దందా నడుస్తుందని మండల కేంద్రంలో పెద్ద ధూమారమే లేస్తుంది. పగలంత యంత్రాలు గుట్టల వద్దనే ఉంటాయి. రాత్రి వేళాల్లో జోరుగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా బహిరంగంగానే అధికారులకు ముడుపులు ఇస్తున్నట్లు చెబుతున్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు..

బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు ఇప్పటి వరకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. దీంతో గుట్టలను తవ్వుతు మొరం దందా చేయడమే కాకుండ ఆ గుట్టలను చదును చేస్తు ప్లాట్లుగా మారుస్తున్నారు. మండల కేంద్రంలోని సర్వే నంబరు 1331లో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని వీడీసీ సభ్యులు ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో మొర పెట్టుకున్నారు. మండల కేంద్రంలో సర్వే నంబరు 1329 నుంచి 1333 వరకు ఉన్నాయి. అందులో అధిక శాతం భూములు ఇదివరకే కబ్జాకు గురయ్యాయి. గత నాలుగేళ్ల నుంచి వీడీసీ సభ్యులు ప్రభుత్వ భూముల కోసం పోరాటం చేస్తునే ఉన్నారు. దీంతో ఒకరే సర్వేయర్ ఒకటే భూమిని సర్వే చేసిన ప్రతి సందర్భంలో ఉన్న భూమిని తేడాగా చూపించడంలో మర్మం ఏమిటోతెలియడంలేదు. ఇప్పటికీ ప్రభుత్వ భూముల కబ్జాల పరంపరం సాగుతూనే ఉంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని, మొరం దందాపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బాల్కొండలోని సమీకృత హాస్టల్ భవనం వెనక ఖాళీ అవుతున్న గుట్ట



ప్లాట్ల కోసం తవ్వేసిన గుట్ట

ఎవరికీ అనుమతివ్వలేదు..

బాల్కొండలో మొరం తవ్వకాల కోసం ఎవరికి ఎలాంటి అనుమతివ్వలేదు. రాత్రివేళల్లో మొరం తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ భూములకు హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. మొరం దందాకు అడ్డుకట్ట వేస్తాం.

– శ్రీధర్, తహసీల్దార్, బాల్కొండ

అమలుకు సాధ్యం కాని హామీలను నమ్మొద్దు

వర్ని: రాష్ట్రంలో ఓట్లను దండుకోవడానికి కాంగ్రెస్, బీజేపీలు అమలు కానీ హామీలను గుప్పిస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మొద్దని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. చందూరు మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌కు రాబోవు ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. చందూర్ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు మూడు కవిత అంబర్ సింగ్, సర్పంచులు గంగారాం, సాయిరెడ్డి, సత్యనారాయణ, దేవిసింగ్, రవి, అశోక్, ఎంపీడీవో నీలావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బీడీ కార్మికులందరికీ జీవనభృతి అందించాలి

బాల్కొండ: బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4వేల జీవన భృతిని అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన బుధవారం మెండోరా తహసీల్దార్ కార్యాలయం వద్ద బీడీ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అంతకు ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నజీర్, శ్రీనివాస్, జంబి పద్మ, బాగ్యలక్ష్మీ,మాధవి, లావణ్య, శైలజ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్): బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అంబం గ్రామంలో బుధవారం ఆయన బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీకి కార్మికులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.నాయకులు శంకర్, బీడీకార్మికులు ఉన్నారు.



మెండోరా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీడీకార్మికులు

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆర్మూర్: నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, సదరు విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో నకిలీ విత్తనాలతో రైతులకు దిగుబడి రాక నష్టపోయారన్నారు. అనంతరం విత్తన వ్యాపారులపై పీడీయాక్టును నమోదు చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేసారు. నాయకులు దేవరాం, గంగాధర్, సారా సురేష్, గంగన్న, రాజన్న, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘ నేతలు

కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేరని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. భీమ్‌గల్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 17న ఆ పార్టీలు వేరువేరుగా సభలు నిర్వహించి కాంగ్రెస్ సభను నిర్వీర్యం చేయాలని ప్రయత్నం చేసినా, ప్రజలు విజయభేరి సభకు పోటేత్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు బీఆర్ఎస్, బీజేపీ నాయకుల గుండెల్లో గుబులు పుట్టేల చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. భీమ్‌గల్ బస్‌డిపోను వచ్చే ఎన్నికల్లో ఓట్లు రాల్చే అంశంగానే పరిగణిస్తున్నారని, పట్టణ ప్రజలు ఈ విషయంలో మోసపోవద్దన్నారు. నాయకులు బొదిరె నర్సయ్య, నాగేంద్ర, వాక మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

కాంగ్రెస్ కార్యాలయాలు ప్రారంభం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి కట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు ముత్యంరెడ్డి, సుంకెట రవి, దెవెందర్, రాహుపాల్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలంలో.

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లిలో కాంగ్రెస్ కార్యాలయాన్ని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మానాల మాట్లాడుతూ.. కాంగ్రెస్ గ్యారంటీ కార్డును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు తిప్పిరెడ్డి శ్రీను, నాగేంద్రబాబు, కొమ్ముల రాజేందర్, సూర స్వామిపాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పల్లెపల్లెకు కాంగ్రెస్..

కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుడు సునిల్‌రెడ్డి పల్లె పల్లెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలు కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను వివరించారు. నాయకులు కొమ్ముల రాజేంధర్‌రెడ్డి, సూర స్వామి తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు





వెంకటాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు.. గైని గుట్ట ఆలయం వద్ద అన్నదానం

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్‌రూరల్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు బుధవారం మూడోరోజు ఘనంగా కొనసాగాయి. ఈసందర్భంగా భక్తులు, ఆయా గణేశ్ మండలి సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద కోలాటలు, పాటలు వంటి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాక్లూర్ మండలంలోని వెంకటాపూర్, గంగరమంద గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్‌లోని పెద్దబజార్‌లో విశ్వసేన యూత్ ఆధ్వర్యంలో 31ఫీట్ల మట్టి గణపతిని ప్రతిష్ఠించారు. ఈ వినాయకున్ని తయారికి సుమారు రూ. 5లక్షల వరకు ఖర్చుఅవుతుందని విశ్వసేన యూత్ అధ్యక్షుడు జక్కం భూమేష్, మందుల బాలు తెలిపారు. అలాగే 72కిలలో భారీ లడ్డును ఏర్పాటు చేశారు. ఈ లడ్డును వేలంపాట వేస్తున్నట్లు పేర్కొన్నారు. రుద్రూర్ మండలం గైని గుట్ట స్వయంభూ బసవేశ్వర ఆలయం వద్ద, రుద్రూర్‌లోని శ్రీ శక్తి గణేష్ మండలి వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.





తట్టికోట్ కాలనీలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.. ఆర్మూర్‌లో విశ్వసేన యూత్ వారి 31ఫీట్ల మట్టి గణపతి

లబ్ధిదారుల వ్యాపారాల పరిశీలన



మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ ద్వారా రుణాలు తీసుకొని లబ్ధిదారులు ప్రారంభించిన వ్యాపారాలను బుధవారం డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్ పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మాక్లూర్‌తో పాటు కల్లెడి, డీకంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. లబ్ధిదారుల రోజువారి ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. పలువురి వ్యాపార కేంద్రాలను ప్రారంభించారు. ఎంపీడీవో క్రాంతి, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, సర్పంచ్ సాదుల్ సవిత బోజన్న, మహిళ సంఘం సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి





ఆర్మూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం కార్మికులు.. బోధన్‌లో..

ఆర్మూర్‌టౌన్: మధ్యాహ్న భోజన (ఎండీఎం) కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటేనే పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఆవరణలో కార్మికులు సమ్మె ప్రారంభించారు. ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెంచిన వేతనాన్ని 2022 ఏప్రిల్ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులు ,రామచందర్, వరలక్ష్మి, కవిత ,గంగమని, స్రవంతి, లక్ష్మి చిన్ను బాయ్, మండలాల నుంచి వచ్చిన కార్మికులుపాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. తమ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని కార్మికులు కోరారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి దశల వారి ఆందోళనలు చేపడుతామని కార్మిక నాయకులు తెలిపారు.

బోధన్‌లో షార్ట్ ఫిల్మ్



బోధన్: బోధన్‌కు చెందిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ కేపీఎస్ గిరిరాజ్ మహా దర్శకత్వంలో, జేజే శతిలయ బ్యానర్‌పై కన్య వజ్రిక మూవీ టైటిల్‌ను బుధవారం ఆవిష్కరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఓ మహిళ నలుగురు ఇంజనీర్ల చేత హింసించబడి హత్యకు గురైన ఘటనను ఇతివృత్తంతో హర్రర్, కామెడీ సమ్మిళితంగా మూవీ ఉంటుందని తెలిపారు.త్వరలోనే షూటింగ్ ప్రారంభమవుతుందని వివరించారు. కో-డైరెక్టర్ బలరాం, కెమెరా మెన్ జయంత్ జాషువా,నటీనటులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ గంగాధర్ తెలిపారు. మోర్తాడ్‌లో నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్ -17, అండర్ -14 బాలబాలికల విభాగంలో పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 22న వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. బుధవారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సినిమాలు	తెలుగు/హిందీ/ఇంగ్లీష్
పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)	
స్క్రీన్-1 -	వాంగురే బంగారు రాజా (తెలుగు) - 10.10, 7.10 రామన్న యూత్ 1.00 ఖుషి: 3.45, బిచ్చగాడు: 10.00
స్క్రీన్-2 -	మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 -	మార్క్ ఆంటోని : 10.10, 1.20, 7.05, 10.15
స్క్రీన్-4 -	జవాన్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45



సంఘం డబ్బుల మళ్లింపుపై విచారణ చేయాలి

రెంజల్(బోధన్): రెంజల్‌లో మూడు గ్రామ సంఘాలు ఉండగా వనిత గ్రామ సంఘం నుంచి గత రెండేళ్లలో సీఏ నవ్య అకౌంట్‌కు రూ.3,06,388లను మళ్లించుకున్నట్లు సంఘం సభ్యులు ఆరోపించారు. అలాగే స్త్రీనిధి అకౌంట్‌కు 4,08,084 రూపాయలను వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా స్త్రీనిధిలో 6లక్షల 99వేల 78 రూపాయలకు సరైన లెక్కలు చూపించడంలేదని మండిపడుతున్నారు. ఈమేరకు బుధవారం ఇన్‌చార్జి ఏపీఎంతో పాటు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి సభ్యులు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ జరిపి, న్యాయం చేయాలని సభ్యులు కోరారు.



ఇన్‌చార్జి ఏపీఎంకు వినతిపత్రం అందిస్తున్న వనిత సంఘం సభ్యులు

సంక్షిప్తం

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి శ్రీనివాస్, భూమయ్య, రాజయ్య, చంద్రయ్య, రవి పాల్గొన్నారు.

యాదాద్రికి తరలిన భక్తులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామస్తులు బుధవారం సర్పంచ్ చింత మల్లారెడ్డి ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దర్శనానికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బస్సులను సమకూర్చగా సర్పంచ్ ప్రజలను తీసుకోని వెళ్లారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఈసందర్భంగా బుధవారం ఆమెను పాటుకూరి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కౌన్సిలర్ సంగీత, సంస్థ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవీపేట: ట్రాన్స్‌కో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎస్‌డీఈఏ సెక్రటరి జనరల్ బీసీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాసరలోని సరస్వతిదేవి దర్శనానికి వెళ్తుండగా నవీపేటలో ట్రాన్స్‌కో ఏఈ దారం ప్రవీన్ ఆయనను కలిసి సన్మానించారు. అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు రాజేంధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని, లక్ష్యంతో ముందుకు సాగాలని వక్తలు శ్రీరామ్, సుధాకర్, రంజిత్‌లు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో బుధవారం కేఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్, ఇగ్నైట్ అనే అంశంపై ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా వక్తలు మాట్లాడారు. డీఐఈవో రఘురాజ్, నిక్కత్ కౌసర్, అద్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్స్ ప్రారంభం



మాక్లూర్: మండలంలోని రామాస్వామి క్యాంప్, గాలిబ్‌నగర్‌లో బుధవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌నగేష్, మనోహర్‌రావు, సర్పంచ్ సాదుల్ సవిత భోజన్న, ఉపసర్పంచ్ గంగాధర్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.